క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు


పూజ చేస్తున్న అర్చకుడు

ఆదోని అర్బన్: ఆదోనిలో వెలిసిన శ్రీ గంగాభవాని దేవాలయంలో మంగళవారం అమావాస్య పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవాలయంలో వెలిసిన శివలింగానికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆదోని డివిజన్ గంగపుత్ర సంఘం నాయకులు, తెలుగు ఈరన్న, దుల్లయ్య, ఆటో వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, దీపక్‌బాబు పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి


ఇమ్మానుయేల్

నందవరం : విద్యుదాఘాతంతో దినసరి కూలీ మృత్యువాత పడ్డాడు. మండలంలోని నాగలదిన్నె గ్రామానికి చెందిన ఇమ్మానుయేల్ అదే గ్రామంలో కోళ్ల ఫారంలో పని చేస్తున్నాడు. ఉదయం కూలి పనులకు వెళ్లిన ఇమ్మానుయేల్ కోళ్ల ఫారంతో ఉన్న బోరు మోటార్‌ను ఆన్ చేయడానికి వెళ్లి షాక్ గురయ్యాడు. ఈ ప్రమాదంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న డాక్టర్ మనోజ్‌కుమార్

కోసిగి: వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ మనోజ్‌కుమార్ ఆశావర్కర్లకు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోసిగి మండలంలో 69 మంది ఆశావర్కర్లు ఉన్నారని, ఏ కాలనీకి చెందిన వారు ఆ కాలనీలో ప్రజలకు చైతన్య కల్పించాలన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల ముందు మురుగునీరు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఎంపీహెచ్‌ఓ శ్రీనివాసులు, సూపర్ వైజర్ రాముడు, హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


పౌష్టికాహారంపై సూచనలిస్తున్న ఎంపీహెచ్ ఈఓ విజయకృష్ణ

ఎమ్మిగనూరుటౌన్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, పండ్లు, పాలు, గుడ్లు తీసుకోవాలని ఎంపీహెచ్‌ఈఓ విజయకృష్ణ, ఏఎన్‌ఎం పరిమళ సూచించారు. మంగళవారం పట్టణంలోని సోమప్ప నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలతో పాటు పోషక విలువలు గల ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ నాగవేణి, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, శ్రీదేవి, పద్మావతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోసిగి: మండలంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వీరేష్ తెలిపారు. ఎమ్మిగనూరు నుంచి మాధవరంకు సరఫరా అయ్యే 132కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు పనులు చేయిస్తున్నందున మండలంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని పేర్కొన్నారు. మండలంలోని విద్యుత్ వినియోగదారులు గమనించాలన్నారు.

టీబీ డ్యామ్‌లో వంద టీఎంసీల నిల్వ

హొళగుంద: కర్ణాటకలోని హోస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయానికి ఎగువన ఉన్న తుంగా, భద్రా ప్రాజెక్టుల నుంచి వరద నీరు కొనసాగుతుంది. ఇన్‌ఫ్లో మరింత పెరిగి అవకాశాలు ఉన్నాయి. మంగళవారం ఉదయం ఇన్‌ఫ్లో 30 వేల క్యూసెక్కులు ఉండగా 1,633 అడుగులతో 105.788 టీఎంసీల నిల్వ సామర్థ్యం గల టీబీ డ్యామ్‌లో రాత్రికి 1632.5 అడుగుల వద్ద 100 టీఎంసీల నిల్వ అయ్యాయి. జలాశయం ఎగువన ఉన్న మలెనాడు, అగొంబె, వర్నాడు, తీర్థనళ్లి, శివమొగ్గ, చిక్క మంగళూరు తదితర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆ నీటితో పాటు ఎగువన ఉన్న తుంగా, భద్రా ప్రాజెక్టుల నుంచి దాదాపు 20 వేల క్యూసెక్కులు టీబీ డ్యామ్ వైపు వదులుతున్నారు. ఇన్‌ఫ్లో మరింత పెరిగితే బుధవారం ఉదయం క్రస్ట్ గేట్లు ఎత్తి 5 వేల క్యూసెక్కుల నుంచి ఎక్కువ మొత్తంలో నీటిని నదికి వదిలే అవకాశాలున్నాయని టీబీ బోర్డు అధికారులు హెచ్చరిక మేసెజ్ విడుదల చేశారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం

- నిబంధనలు పాటించని మెడికల్ షాపుల నిర్వాహకులు
- ఫార్మాసిస్టులు లేని దుకాణాలే ఎక్కువ
- డాక్టర్ చీటీ లేకుండానే మందుల విక్రయాలు
- కొన్ని షాపుల్లో కాలం చెల్లిన మందుల అమ్మకాలు
- తనిఖీలు చేపట్టని అధికారులు



ఆదోని డగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం

ఆదోని అర్బన్: నియోజకవర్గంలో మందుల దుకాణలను ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారు. దుకాణం నిర్వహించే వ్యక్తి ఫార్మాసిస్టు అయ్యి ఉండాలన్న నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. ఏమాత్రం అవగాహన లేనివారు మందులను విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కొన్ని దుకాణాల్లోని కాలంచెల్లిన మందులు విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు.. దుకాణ యజమానులు ఇచ్చే నెలవారీ మామూళ్లు పుచ్చుకుంటూ తనిఖీలకు స్వస్తి చెప్పారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

80 శాతం ఫార్మాసిస్టులు లేని దుకాణాలే

ఆదోని నియోజకవర్గంలో 130 మెడికల్ షాపులు, 30 ఏజెన్సీలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే 80 శాతం వరకు ఫార్మాసిస్టులు లేని దుకాణాలే ఉన్నాయని తెలుస్తోంది. ఎక్కడైనా ఆస్పత్రి కొత్తగా ఏర్పాటు చేస్తున్నారంటే దానికి అనుసంధానంగా మందుల దుకాణం ఏర్పాటుకు లక్షల రూపాయలు గుడ్‌విల్‌గా ఇచ్చేందుకు వ్యాపారులు వెనుకాడడం లేదు. మందుల దుకాణంలో వచ్చే ఆదాయం ఎక్కువగా ఉండడంతో ఆ ఆస్పత్రి వర్గాలే సొంతంగా మెడికల్ షాపులను ఏర్పాటు చేసుకుంటున్నాయి.

ఫార్మాసిస్టులు కరువు

నిబంధనల ప్రకారం మందుల దుకాణాల్లో ఫార్మాసిస్టులు మాత్రమే మందులు ఇవ్వాల్సి ఉంటుంది. దుకాణం నిర్వహిస్తున్న సమయాల్లో ఆయన పర్యవేక్షణల్లోనే మందుల విక్రయాలు జరగాలి. కానీ కొన్ని దుకాణాల్లో ఫార్మాసిస్టులు లేరు. పట్టణాల్లోనే ఈ పరిస్థితి కొనసాగుతుంటే ఇక గ్రామాల్లో అయితే ఫార్మాసిస్టులు మచ్చుకుకూడా కనిపించడంలేదు. ఇతరుల సర్టిఫికెట్లను అద్దెకు తెచ్చుకుని దుకాణాలను నడుపుతున్నారు.

ప్రిస్క్రిప్షన్ లేకుండానే విక్రయం

వైద్యులు సిఫార్సు చేసిన మందుల చీటీ ఆధారంగానే జలుబు, జ్వరం వంటి చిన్నచిన్న రోగాలకు సైతం మందులు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే మందుల చీటీ లేకుండానే చిన్నపిల్లలు వెళ్లి అడిగినా మందులు ఇచ్చేస్తున్నారు. మందుకు కొనుగోలుదారులకు ఎలాంటి బిల్లులు ఇవ్వడం లేదు. ఎవరైనా రీయింబర్స్‌మెంట్ కోసం కొనుగోలు చేసేందుకు బిల్లులు అడిగితే ఎమ్మార్పీ ధరలు, దానిపై జీఎస్టీ వేసి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

కాలంచెల్లిన మందులు ఎమ్మార్పీకి విక్రయం

కొంత మంది దుకాణదారులు కొన్ని ఏజెన్సీల దగ్గర కాలం చెల్లిన మందులను అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎమ్మార్పీకే అమాయకులైన చదువురాని వారికి విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి దుకాణాలు పట్టణాల్లో కొన్ని ఉంటే గ్రామాల్లో అధిక సంఖ్యలో మెడికల్ షాపుల్లో ఇలాంటి విక్రయాలే చేస్తున్నట్లు తెలుస్తోంది. పెద్ద హరివాణంలో ఓ షాపులో ఇలాగే జరుగుతుందని సమాచారం. అయితే ఏ ఏజెన్సీలో, ఏ దుకాణంలో ఇలాంటి విక్రయం చేస్తున్నారో అధికారులు తెలుసన్న ఆరోపణలు ఉన్నాయి. వారికి తెలిసినా కూడా పట్టించుకోవడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వ్యాపారులు స్ట్రిప్స్‌లో ఎక్స్‌పైరీ తేదీ ఉన్న భాగాన్ని తొలగించి మిగిలిన మాత్రలను దర్జాగా విక్రయిస్తున్నారని తెలుస్తోంది. అధికారులు పగడ్బందీగా దాడులు చేస్తే మందుల దుకాణాల్లో సైతం ఇటువంటి ఎక్స్‌పైరీ వ్యవహారాలు బయటపడతాయని పలువురు చెబుతున్నారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో కొంతమంది స్వార్థపరులైన వ్యాపారులు బరి తెగిస్తున్నారు. .

> **చర్యలు తీసుకుంటాం**
>
> నెలలో ఏడు, ఎనిమిది మెడికల్ షాపుల్లో తనిఖీ చేపడుతున్నాం. బిల్లులు ఇవ్వకపోవడం, ఫార్మాసిస్టు లేకపోవడంపై తనిఖీల్లో పట్టుబడితే ఏడీకి రిపోర్టు పంపుతున్నాం. ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మందుల విక్రయం చేయాలి. దానిపై చర్యలు తీసుకుంటున్నాం. కాలం చెల్లిన మాత్రలు విక్రయించకూడదు. అవి ప్రజలకు ప్రాణహానీలాంటిది. దీనిపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నాం. జీరోలో జరిగే వ్యాపారంపై దృష్టి పెడతాం.
>
> – హరిహరతేజ, ఆదోని ఇన్‌చార్జి డ్రగ్ ఇన్‌స్పెక్టర్

జీరోలోనే క్రయవిక్రయాలు

హోల్‌సేల్ దుకాణంలో కొంతమంది జీరోలోనే జోరుగా క్రయ, విక్రయాలు జరుపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీఎస్టీ రూపంలో అధిక మొత్తం మిగులుతుందని కొంతమంది స్వార్థపరులైన ఏజెన్సీ నిర్వాహకుల వ్యవహారం. ఫుడ్‌కు సంబంధించిన ప్రొటీన్, టానిక్ తదితర వాటికి జీఎస్టీ 18 శాతం ఉంటుంది. అదేవిధంగా షుగర్‌కు సంబంధించిన మందులకు జీఎస్టీ 5 శాతం, అన్ని మందులకు 18 శాతం జీఎస్టీ ఉంటుంది. ఇలా మిగిలించుకోవడానికి రహస్యంగా జీరోలోనే వ్యాపారం నిర్వహిస్తున్నట్లు సమాచారం. రూ.5 లక్షలు సరుకు వస్తే అందులో కనీసం రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు జీరోలో వ్యాపారం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆదోని సబ్‌కలెక్టర్‌గా మౌర్య భరద్వాజ్


జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిసిన సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ఆదోని సబ్‌కలెక్టర్‌గా మౌర్యభరద్వాజ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం కర్నూలులో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను నూతన సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు చేపడుతున్నట్లు సబ్‌కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

పిచ్చి కుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని సాయిబాబా కాలనీలో ఓ పిచ్చి కుక్క స్వైర్య విహారం చేసింది. మంగళవారం ఉదయం పిచ్చికుక్క దాడి చేయడంతో ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న కమ్మరి గోవిందమ్మ, బదినేహాల్ మారెప్ప, ఈరన్న గాయపడ్డారు. గోవిందమ్మ చేతి భాగాన రక్తం వచ్చేలా కరిచింది. ఆముగ్గురు కోసిగి ప్రాథమిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి రేబిస్ వ్యాక్సిన్ వేయించుకున్నారు. గోవిందమ్మ మెరుగైన వైద్యం కోసం ఆదోనిలోని హాస్పిటల్‌కు తరలించారు. కాలనీలో రోడ్లపై వెళ్లే ప్రజలకు కుక్కలు దాడులు చేస్తున్నాయని, పంచాయతీ సిబ్బంది కుక్కలను అదుపు చేయాలని స్థానిక ప్రజలు కోరారు.

ఘనంగా వీరభద్రస్వామి జయంతి ఉత్సవం


వీరభద్రస్వామికి పల్లకోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో వెలసిన వీరభద్రస్వామి జయంతి ఉత్సవం మంగళవారం వైభవంగా సాగింది. తెల్లవారు జామున స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు సుప్రభాతసేవ, మహా మంగళహారతి, ఆకుపూజ వంటి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ పుర వీధుల గుండా స్వామి పల్లకీ మహోత్సవాన్ని అశేష జనవాహిని మధ్య డప్పు వాయిద్యలతో చేపట్టారు. నిర్వహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆదోని అర్బన్: భాద్రపద మాసం మొదటి మంగళవారం కావడంతో పట్టణంలోని సంతపేటలోని అల్కూరు మఠం మహర్షి విజయ్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పేట వీరభద్రస్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, కలశపూజ, ఉమామహేశ్వరుల పూజ, ఆదిగురు శ్రీ రేణుకచార్యుల వారికి అభిషేకం, వీర భద్రేశ్వరస్వామి మూలవిరాట్‌కు రుద్రాభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తికి పల్లకీ సేవ చేపట్టారు. భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలోని వీరభద్రస్వామి దేవాలయంలో వీరశైవమఠం పీఠాధిపతి శివయ్యస్వామి ఆధ్వర్యంలో మంగళవారం వీరభద్రస్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామికి తుంగభద్ర జాలాలతో అభిషేకం, మహామంగళహారతి, ఆకుపూజతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం భజన కార్యక్రమం చేపట్టారు.

ధరలు తగ్గించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నందవరం: నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్న గౌడ్, మండల కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సీపీఐ ఆధ్వర్యంలో రాస్తోరోకో చేపట్టారు. వారు మాట్లాడుతూ నిత్యావసర సరుకులు ధరలు పెరగడంతో సామాన్య ప్రజలు మోయలేని భారం పడిందన్నారు. మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో తగ్గిస్తామని చెప్పినా.. ఇంత వరకు చేసింది ఏమి లేదని మండపడ్డారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. సీపీఐ నాయకులు శాంతప్ప, ముని తిమ్మప్ప, మల్లేష్, నరసప్ప, విజయ్‌కుమార్, ఆంజనేయ, బడేసాబ్ ఉన్నారు.

ఆశావర్కర్ల వేతనాలు పెంచాలి


కోసిగిలో నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం, పెద్దతుంబళం గ్రామాల్లోని ఆశావర్కర్లు ప్రభుత్వం తమ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆస్పత్రి వైద్యురాలికి వినతి పత్రం మంగళవారం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి వీరారెడ్డి, మండల ఉపాధ్యక్షులు బి.తిక్కప్ప, ఆశావర్కర్ యూనియన్ మండల కార్యదర్శి లత, నాయకురాలు లావణ్య మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి 9వ తేదీన జరిగిన చర్చల్లో భాగంగా ఆశావర్కర్ల వేతనాలు పెంచాలని, రికార్డులు వెంటనే ఇవ్వాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు రాజేశ్వరి, సుకన్య, మల్లేశ్వరి, విశాలాక్షి, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: ఆశావర్కర్స్ ఒప్పంద జీవోలను అమలు చేయాలని సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శి రాముడు, వీరేష్‌లు కోరారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీ ఆశావర్కర్స్ అసోషియేషన్ కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డాక్టర్ మనోజ్‌కుమార్‌కు అందజేశారు. యూనియన్ నాయకురాలు వెంకటమ్మ, సుజాత పాల్గొన్నారు.

నందవరం: ఆశావర్కర్స్‌కు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఒప్పంద జీవోలను అమలు చేయాలని సీఐటీయూ తాలూకా కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ అసోషియేషన్ ఆధ్వర్యంలో హాస్పిటల్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం వినతి పత్రాన్నిను డాక్టర్స్ విజయభారతి, పరిమళకు అందజేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్స్ పరిమళ లలిత, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నమరివీడులో డెంగీ కేసు నమోదు


వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా మలేరియా అధికారి నూకరాజు

గోనెగండ్ల : మండల పరిధిలోని చిన్నమరివీడు గ్రామంలో 46 ఏళ్ల మహిళకు డెంగీ నిర్ధారణ అయినట్లు జిల్లా మలేరియా అధికారి నూకరాజు తెలిపారు. దీంతో మంగళవారం మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా, ఈఓఆర్డీ నాగేష్, సిబ్బంది చిన్నమరివీడు గ్రామానికి వెళ్లికి నివారణ చర్యలు చేపట్టారు. డెంగీ బాధితురాలి ఇంటి పరిసరా ప్రాంతంలో మురుగు నీరు, నిల్వ ఉన్న నీటిని తొలగించి దోమల మందును పిచికారీ చేయించారు. గ్రామస్తులకు డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించారు. అలాగే గ్రామంలో ప్రతి ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వే చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు.

అనారోగ్యంతో ఇంటర్ విద్యార్థి మృతి

కౌతాళం: అనారోగ్యంతో విద్యార్థి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని బాపురం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. కౌతాళం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం సీఈసీ చదువుతున్న రంగన్న (17) రెండు రోజుల నుంచి కడుపు నొప్పి అని చెప్పడంతో తల్లిదండ్రులు లింగన్న, పద్మవతిలో స్థానికంగానే చూపించారు. కాగా మంగళవారం లోబీపీ రావడంతో రంగన్న మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విద్యార్థి రంగన్న మృతితో కళాశాలకు మధ్యాహ్నం నుంచి సెలవు ప్రకటించారు. ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, అధ్యాపకులు సంతాపం తెలిపారు.

ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో మూడు రోజుల పాటు నిర్వహించుకునే వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని, ఇందుకు అన్ని శాఖల సంపూర్ణ సహకారం వుంటుందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వినాయక ఉత్సవాలపై పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక చవితి, నిమజ్జనానికి అన్ని శాఖల వారు తగిన ఏర్పాట్లు చేస్తారన్నారు.శాంతియుత వాతావరణంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని, ఇతరులకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. మున్సిపల్ డీఈ నీరజ, తహసీల్దార్ శేషఫణి, సీఐలు సుదర్శన్‌రెడ్డి, విక్రమసింహా, గంగాధర్, ఆర్టీసీ డీఎం అమర్నాథ్, ఫైర్‌స్టేషన్ అధికారి రామాంజినేయులు, వినాయక కేంద్ర కమిటీ సభ్యులు మాచాని శివకుమార్, నరసింహులు, ముస్లిం మతపెద్దలు ఖాశింబేగ్, యుసుఫ్ మౌలానా, మౌలానా అతావుల్లా తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని రూరల్: గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన ఆ గ్రామ సర్పంచ్‌లు కృషి చేయాలని, అందుకు కూటమి ప్రభుత్వం సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో సర్పంచులు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సర్పంచులందరూ మొదటి ప్రాధాన్యతగా తాగునీటి సమస్యపై దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. అనంతరం డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలన్నారు. మిగతా సమస్యలు ఏవైనా ఉంటే ఎప్పటికప్పుడు తనదృష్టికి తీసుకొస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు తెప్పించేందుకు కృషి చేస్తానన్నారు. సమావేశం ఎంపీడీఓ గీతావాణి, ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ వీరభద్రప్ప, పీఆర్ ఏఈ మాలిక్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

యోగాలో కస్తూర్బా విద్యార్థినుల ప్రతిభ


యోగా పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణం కాస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థినులు యోగా పోటీల్లో ప్రతిభ చాటినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ శాంతి, వ్యాయమ ఉపాధ్యాయురాలు సునంద తెలిపారు. మంగళవారం కర్నూలులో జిల్లా లెవల్‌లో జరిగిన యోగా పోటీల్లో జె.దీపిక, బి, మమత, సి.గాయిత్రి ప్రతిభ చాటారన్నారు. త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే యోగా పోటీల్లో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను అభినందించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


పట్టుబడిన మద్యంతో సీఐ మంజునాథ్, ఎస్‌ఐ చంద్రమోహన్

కోసిగి: మండల పరిధిలోని వందగల్లు గ్రామానికి చెందిన చూడి ఎల్లప్ప అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు కోసిగి సీఐ మంజునాథ్, ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. సమాచారం మేరకు మంగళవారం ఉరుకుంద ఆర్చ్ వద్ద నుంచి బైక్‌పై మద్యం తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. ఆయన వద్ద నుంచి 6 బాక్స్‌లలో 576 ఒరిజనల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ 90ఎంఎల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బైక్‌ను సీజ్ చేసి ఆ వ్యక్తి పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ కాషయ్య, పోలీస్ సిబ్బంది ప్రసాద్, వలి ఉన్నారు.

రోడ్డుపై నాట్లు వేసి నిరసన


నాట్లు వేసి నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని రూరల్: మండలంలోని గణేకల్ గ్రామంలోని 3వ వార్డులో రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు బి.వీరారెడ్డి, డి.రామాంజనేయులు, డీవైఎఫ్‌ఐ మండల నాయకులు చిరంజీవి అన్నారు. మంగళవారం వర్షంలో రోడ్డుపై నాటు వేసి నిరసన తెలిపారు. కొద్దిపాటి వర్షం వచ్చినా మట్టి రోడ్లపై వర్షపునీరు పూర్తిగా నిలబడి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు బంగారయ్య, వెంకటేశులు, పెద్ద వీరేష్, బంగారుబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఆదోని అర్బన్: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన సూరి(35) అనే వ్యక్తి సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆలూరు తాలూకా హాలహర్వి మండలం అర్ధగేరి గ్రామానికి చెందిన సూరి కొన్నేళ్లుగా పట్టణానికి వచ్చి అంబేడ్కర్‌నగర్‌లో కిరాణాషాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక సమస్యలు, భార్యతో గొడవపడి సోమవారం రాత్రి మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఎంతసేపటికీ బయటికి రాకపోవడంతో భార్య సిరిమల్లే సరోజ తలుపులు తీయగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు, వెంటనే ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య సరోజ, ఇద్దరు సంతానం. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పార్ట్ టైం జాబ్ ఇస్తామని మోసం

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎంఐజీ కాలనీకి చెందిన కౌశిక్ ఇన్‌స్టా గ్రామ్‌లో పార్ట్ టైం ఉద్యోగం ఇప్పిస్తామని రీల్ రావడంతో దానిని నొక్కి రూ.20 వేలు పోగొట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... ఆగస్టు 31వ తేదీన రీల్ చూస్తుండగా అందులో పార్ట్ టైం జాబ్ చేసుకోవచ్చని, ఈ నంబర్‌కు సంప్రదించాలని రీల్ వచ్చింది. దీంతో వెంటనే కౌశిక్ ఆ నంబర్‌కు ఫోన్ చేశాడు. సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి మూడు దఫాలుగా రూ.20 వేలు ఫోన్ పే ద్వారా పంపాడు. మరలా డబ్బును పంపాలని సైబర్ నేరగాళ్లు చెప్పడంతో, మోసపోయానని బాధితుడు కౌశిక్ తెలుసుకుని త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును సైబర్ క్రైమ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

చినుకు పడితే చిత్తడే


బురదమయంగా మారిన మట్టి రోడ్డు

ఆదోని టౌన్: పట్టణంలోని అమరావతినగర్ (కొత్త అమరావతి)లో చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. డ్రైనేజీ కాలువలు లేక సీసీ రోడ్లు లేక కొన్ని చోట్ల వీధిలైట్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగంతా రోడ్లపైనే నిలిచిందని, రాత్రివేళల్లో విష పురుగులు సంచరిస్తున్నాయన్నారు. అధికారులు కాలనీవైపు కన్నెత్తి కూడా చూడడం లేదని, ఇప్పటికైనా స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

వీధులన్నీ జలమయం


వైఎస్సార్ సర్కిల్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు


వైఎస్సార్ నగర్‌లోని ఓ రహదారి

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మంగళవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. దీంతో గ్రామంలోని ప్రధాన విధులన్నీ జలమయమయ్యాయి. వైఎస్సార్ సర్కిల్‌లో రోడ్డుపై నుంచి వర్షం నీరు పారాయి. మంచాల్‌వీధి, వైఎస్సార్ కాలనీ, జేకేఎల్‌ఎస్ నగర్‌లలో వర్షపు నీరు ఇళ్లలోకి చేరాయి. గ్రామంలో ఏ వీధి చూసినా వర్షపు నీరు రెండు అడుగుల మేర ప్రవాహించాయి. పంటల పరిస్థితి దారుణంగా ఉంది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తేమ శాతం పెరిగిపోవడంతో ప్రధానంగా సాగైన పత్తి, మిరప పంటలు కుళ్లి పోతున్నాయని రైతుల ఆందోళన చెందుతున్నారు.